# మళ్లీ తెరపై ఎస్సీల వర్గీకరణ

దాదాపు 14 ఏళ్ల క్రితం నాటి ఎస్సీల వర్గీకరణ సమస్య నేడు మళ్లీ తెరపైకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్డ్ కులాలను ఏబీసీడీలుగా విభజించడంపై కేంద్ర ప్రభుత్వం ఉషామెహ్రా కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ నివేదిక సిద్ధం చేసిందనే వార్తలు రావడంతో.. ప్రధాన ఎస్సీ కులాలైన మాల, మాదిగ వర్గాల నేతలు రాజధాని హైదరాబాద్‌లో నిరశన దీక్షలకు దిగారు. ఉషామెహ్రా కమిషన్ వర్గీకరణకు అనుకూలంగా నివేదికలో సిఫారసు చేసినట్లు తెలియడంతో ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్న మాలమహానాడు ఆందోళన చేపట్టింది.

ఎస్సీల వర్గీకరణ అనగానే రాష్ట్రంలో మాల, మాదిగ కులస్థుల మధ్య చీలిక, ఘర్షణకు దారితీసే అంశంగా అందరి కళ్లముందు కదలాడుతుంది. కోటా ఫలితాలు పెద్దగా అందని మాదిగలు రిజర్వేషన్లను జనాభా నిష్పత్తి ప్రకారం పంచాలని కోరుతుంటే. పలు రంగాల్లో కాస్త ముందుకెళ్లిన మాలలు 'కోటాలో కోటా' మంచిది కాదని వాదిస్తున్నారు. ఈ వర్గీకరణ వివాదంలో ప్రధానపాత్ర ఈ రెండు కులాలదే. మిగిలిన కులాలవారు ఈ గొడవలకు దాదాపు దూరంగానే ఉన్నారని చెప్పవచ్చు. విద్యాసంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కొన్ని సామాజిక వర్గాలకు కోటాలు కల్పించడం దశాబ్దాల నుంచీ వివాదాస్పద అంశంగానే ఉంది. రిజర్వేషన్ ఉన్న కులాలకు, లేని కులాలకు మధ్య రగిలే ఘర్షణ ఇలా ఉంటే. గత ఒకటిన్నర దశాబ్దాలుగా 'కోటా' కులాల మధ్య చిచ్చు కొనసాగడం గమనార్హం!

SAKSHI

## నాలుగు గ్రూపులుగా:

రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో కాంగ్రెస్ 82వ ప్లీనరీ సందర్భంగా ఈ వర్గీకరణ వివాదం ఎవరూ ఊహించని విధంగా ముందుకొచ్చింది. మహాసభలు ప్రారంభమయ్యే రోజునే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) 'కురుక్షేత్ర' ప్రదర్శన తలపెట్టింది. చివరికి ఆ రోజు ఘర్షణ లేకుండా చర్చల ద్వారా జరిపిన ప్రయత్నం సఫలమైంది. సమస్య మాత్రం అపరిష్కృతంగానే మిగిలిపోయింది. 1995లో మొదలైన మాదిగ దండోరా పోరాటం అందరి దృష్టినీ ఆకర్షించింది. కొంతకాలం పోరాటం జరిగాక అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఎస్సీలను బీసీల మాదిరిగా నాలుగు గ్రూపులుగా విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది అమల్లోకి వచ్చిన కొద్ది కాలానికే అది చెల్లదని న్యాయస్థానాలు తీర్పులిచ్చాయి.

## 1970ల్లోనే ఫిర్యాదు:

ఎస్సీల వర్గీకరణ చేయాలంటే దానికి రాజ్యాంగ సవరణ తప్పదని తేలింది. ఫలితంగా రెండు అణగారిన

కులాల మధ్య వివాదం ఆవేశకావేశాలకు దారితీసింది. వర్గీకరణ కోరుతున్న ఎమ్మార్పీఎస్.. వ్యతిరేకిస్తున్న మాలమహానాడు పాదయాత్రలు, ర్యాలీలు నిర్వహిస్తూ ఆందోళన కొనసాగిస్తున్నాయి. దాదాపు అన్ని రాజకీయ పార్టీలూ వర్గీకరణకు అనుకూలంగానే స్పందిస్తున్నాయి. రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలవారికి ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో 15 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఎస్సీల్లో 59 కులాలను చేర్చారు. ఈ దళిత కులాల్లో బాగా చదువుకున్న మాలలే కోటాలో సింహభాగాన్ని అనుభవిస్తున్నారనీ, జనాభా నిష్పత్తితో పోల్చితే ఎక్కువ ఉద్యోగాలు తన్నుకుపోతున్నారని చెబుతూ... జనాభా రీత్యా రెండో పెద్ద కులమైన మాదిగలు 1970ల్లోనే ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు.

## కోటా విభజించాలి:

మాలలు, మాదిగలను వేర్వేరు గ్రూపుల్లో చేర్చి  కోటా విభజించాలనేది ఎమ్మార్పీఎస్ డిమాండు. మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో.. ఎమ్మార్పీఎస్ 1995 నాటికే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉద్యమం చేపట్టింది. మాదిగ దండోరా ఉద్యమకారులు దాదాపు అన్ని రాజకీయ పక్షాల మద్దతు కూడగట్టగలిగారు. ఆ నేపథ్యంలో 1997లో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలను నాలుగు గ్రూపులుగా వర్గీకరించింది. ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా ఎస్సీల వర్గీకరణకు ఇతర రాష్ట్రాల్లో ఆందోళనలు లేవు.  అదీగాక దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఎస్సీ కులాల మధ్య అంతరాలు ఒకేలా లేవు.  రాష్ట్రంలో చర్మకార వృత్తి నుంచి వచ్చిన మాదిగ కులస్థులు మాలలతో పోల్చితేఎక్కువ వెనుకబడినమాట వాస్తవమే!  దీనికి అనేక చారిత్రక కారణాలున్నాయి.

## ఉత్తరాది రాష్ట్రాల్లో:

ఉత్తరాది రాష్ట్రాల విషయానికి వస్తే.. చర్మకారులైన చమార్ కులానికి చెందిన ప్రజలు పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లలో అన్ని రంగాల్లో ఇతర దళిత వర్గాలతో పోల్చితే ముందున్నారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి మాయావతి, కేంద్ర మాజీ మంత్రి బూటాసింగ్ చర్మకార వర్గాలకు చెందినవారే. ఇంతకు ముందు చెప్పిన మూడు రాష్ట్రాల్లో. ఎస్సీల వర్గీకరణకు చర్మకార వృత్తికి చెందిన వర్గాలు అంత సుముఖంగా లేవంటున్నారు.  అంతేకాక 1991 తర్వాత దేశంలో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితంగా సంపద పెరిగింది. ఉపాధి అవకాశాలూ మెరుగయ్యాయి. ప్రైవేటు రంగం అనూహ్యంగా విస్తరించింది. ప్రపంచీకరణ ఫలితంగా అధిక వేతనాలు లభించే కొత్త రంగాల్లో ప్రవేశించాలంటే... ఉన్నత విద్య, ఇతర నైపుణ్యాలు అవసరం. బడుగు వర్గాల పురోగతికి ఉద్యోగాల్లో కోటా ఒక్కటే పరిష్కారం కాదు. ఈ పరిస్థితుల్లో దళితుల మధ్య రగిలిన వర్గీకరణ చిచ్చు.. సామాజిక న్యాయం కాంక్షించేవారందరికీ ఆందోళన కలిగించే అంశంగా మారింది.

–నాంచారయ్య మెరుగుమాల

SAKSHI